రోడ్ల విస్తరణకు రంగం సిద్ధం

- 50 డివిజన్లలో 23 రహదారుల అభివృద్ధికి ప్రణాళిక
- మొదటి దశలో ప్రధాన రహదారుల విస్తరణ


నగరంలోని జాగృతి బ్లడ్ బ్యాంక్ రహదారి


రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ వెళ్లే రోడ్డు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో రోడ్ల విస్తరణకు రంగం సిద్ధమైంది. 2027లో రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఉన్న రోడ్లను విస్తరణతో అభివృద్ధి చేసేందుకు నగరపాలక సంస్థ సిద్ధమైంది. దీనిలో భాగంగా నగరంలోని 50 డివిజన్లలో 23 రోడ్లను విస్తరించేందుకు దశల వారీగా ప్రణాళికలను సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో నగరపాలకసంస్థ విస్తరించింది. సిటీ నియోజకవర్గంలోని 42 డివిజన్లలో 18 రోడ్లు, రూరల్ నియోజకవర్గంలోని 8 డివిజన్లలో ఐదు రోడ్లను విస్తరించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేశారు.

రోడ్ల విస్తరణ

మొదటి ఫేజ్‌లో కోరుకొండ రోడ్డు, మోరంపూడి రోడ్డు, ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డు, గోరక్షణపేట, దానవాయిపేట రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డు, గాదాలమ్మ నగర్ రోడ్డు, తాడితోట నుంచి స్టేడియం వెళ్లే రోడ్లను విస్తరించనున్నారు. ఈ మేరకు రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్లను (ఆర్‌డీపీ) సిద్ధం చేశారు. రెండో ఫేజ్‌లో విస్తరించనున్న రోడ్లకు కూడా తయారు చేస్తున్నట్టు నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం అధికారులు వెల్లడించారు.

ఆక్రమణల తొలగింపునకు..

తాడితోట నుంచి సంహిత కాలేజీ మీదుగా రామకృష్ణ థియేటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, మోరంపూడి వరకు రోడ్డును విస్తరించనున్నరు. దీనిలో భాగంగా ఆక్రమణలను తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వీటితో పాటు నగరంలో దానవాయిపేట, ప్రకాశం నగర్, గుండువారి వీధిలో అంతర్గత రోడ్లను సైతం విస్తరించనున్నట్టు అధికారులు ప్రకటించారు. పుష్కరాలకు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం గోదావరి బండ్‌ను కలిపి రోడ్లను విస్తరించేందుకు ప్లాన్లను సిద్ధం చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా..

ఇప్పటి వరకూ ఉన్న రోడ్లను మొదటి ఫేజ్‌లో వంద అడుగుల మేర విస్తరించేందుకు రంగం సిద్ధమైంది. రానున్న పుష్కరాలకు నగరానికి కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలకు ఆచరించేందుకు రానున్న నేపథ్యంలో పలు దశల్లో నగరంలో రోడ్లను, ప్రధాన రోడ్లను, అంతర్గత రోడ్లను వెడల్పు చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ కేతన్ గార్గ్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా తరలివచ్చే భక్తులకు ఏ విధమైన ఆటంకాలు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

టీడీఆర్ బాండ్లు అందిస్తాం



నగరాన్ని అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు తయారు చేశాం. రోడ్ల విస్తరణలో స్థలాలు ఉన్న యజమానులు వాటిని, నగర పాలక సంస్థకు స్వచ్ఛందంగా ముందుకు వస్తే టీడీఆర్ బాండ్లు అందజేస్తాం. 2027లో జరగనున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నగరాభివృద్ధితో పాటు రోడ్ల విస్తరణకు కూడా సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాం. ప్రధాన రహదారులతో పాటు దానవాయిపేట, ప్రకాశం నగర్ వంటి ప్రాంతాలలో అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేయనున్నాం.

– కేతన్ గార్గ్, కమిషనర్, నగర పాలక సంస్థ

కంపెనీ సెక్రటరీషిప్‌పై అవగాహన

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో కామర్స్ విద్యార్థులకు కంపెనీ సెక్రటరీషిప్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీబీఏ ప్రోగ్రామ్స్ స్ట్రీమ్ కో ఆర్డినేటర్, కార్యక్రమ నిర్వహణ కార్యదర్శి డాక్టర్ బి.ప్రతిమ మాట్లాడుతూ బీకాం, బీబీఏ విద్యార్థులకు కంపెనీ సెక్రటరీషిప్‌లో ఉజ్వల కెరీర్ అవకాశాలను ఉన్నాయని, వాటిని విద్యార్థులకు పరిచయమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. దీనికి భారత కంపెనీ సెక్రటరీస్ ఇనిస్టిట్యూట్ (ఐఈఐ) సహకారం పొందామన్నారు. ఈ మేరకు ఐఈఐ నుంచి ఇద్దరు ప్రతిష్టాత్మక స్పీకర్లను ఈ కార్యక్రమానికి అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రాజమహేంద్రవరం నుంచి ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీ పి.అన్నపూర్ణ, విశాఖపట్నం నుంచి ప్రోసిమెట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో కంపెనీ సెక్రటరీ మిస్ వంశిక లూనియా పనిచేస్తున్నారన్నారు. సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ పి.షణ్ముఖరావు మాట్లాడుతూ కంపెనీ సెక్రటరీలకు ఉన్న ఉద్యోగ అవకాశాలు, రూ.10 కోట్ల కంటే ఎక్కువ టర్నోవర్ ఉన్న కంపెనీల్లో కంపెనీ సెక్రటరీని నియమించాల్సిన నిబంధనను వివరించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 250 మంది విద్యార్థులకు రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు బత్తిన రాజరాజేశ్వరి అధ్యక్షతన మంగళవారం.ఈ కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ ఫౌండర్ సెక్రటరీ మతల రమేష్, అధ్యక్షుడు చలుమూరి సత్యనారాయణ, సెక్రటరీ రెడ్డి బాబు, మెరపల శ్రీను, ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పాడుగు శ్రీను


నియామక ఉత్తర్వులు అందుకుంటున్న పాడుగు శ్రీను

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడిగా పాడుగు శ్రీను (గాడాల)ను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎన్.మారేష్ ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య చేతుల మీదుగా శ్రీను నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా పాడుగు శ్రీను మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి, అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

మద్యం షాపుల కేటాయింపులో అన్యాయం


లోడా అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వం గీత కులాలకు మద్యం దుకాణాలు కేటాయించే విషయంలో శ్రీ శయన కులస్తులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ శ్రీ శయన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోడా అప్పారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. 1996లో జారీ చేసిన 31 జీవో ప్రకారం శ్రీశయన (శెగిడి)గా తామంతా కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం జారీ చేసిన 13/2025 జీవో ప్రకారం శ్రీశయన వేరు, శెగిడి కులం వేరుగా కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారే మద్యం షాపులు పొందడానికి అర్హులని ఎక్సైజ్ అధికారులు ఆంక్షలు విధించారన్నారు. దీంతో శ్రీశయన కులస్తులు మద్యం దుకాణాలు పొందడానికి అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. ఏలూరు జిల్లాలో 50 వేలమంది శ్రీశయన కులస్తులు నివసిస్తున్నా కనీసం ఒక్క మద్యం షాపు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రకాశం నగర్: ఆన్‌లైన్ రాపిడ్, ఓలా, ఓబర్ ఆటో డ్రైవర్లందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆన్‌లైన్ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. స్థానిక అంబల్ల సూర్యారావు భవన్‌లో అధ్యక్షుడు కె.రామచంద్రరావు అధ్యక్షతన మంగళవారం ఆన్‌లైన్ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ముందుగా ఆటోలకు అతికించే యూనియన్ స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి ఆటో కార్మికులు బతుకుతెరువు కోసం పట్టణాలకు వస్తున్నారన్నారు. వారందరికి ఒక చోటే రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికీ ఆ హామీలు అమలు చేయడం లేదన్నారు.

మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో ఎస్‌కేవీటీ ప్రతిభ

ప్రకాశం నగర్: మహిళా హ్యాండ్ బాల్ పోటీల్లో ఎస్‌కేవీటీ కళాశాల తృతీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ డీవీ రమణ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన కాలేజీ ఎట్ మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ కళాశాలకు చెందిన జట్టు ఈ ఘనత సాధించాయన్నారు. ఫిబ్రవరిలో జరగబోయే సౌత్‌జోన్ పోటీల్లో నన్నయ వర్సిటీ తరఫున తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఎల్.వైష్ణవి, ఎస్.పూజ, ఎం.అశ్విని ఎంపికైనట్లు తెలిపారు.

మానవ అక్రమ రవాణాపై సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్ బాబు

కంబాలచెరువు: మానవ అక్రమ రవాణాపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు మంగళవారం సమావేశం నిర్వహించారు. మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లల కేసులపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రకాశ్ బాబు మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో తగినంత సమయం గడపక పోవడం, అదే సమయంలో అపరిచితులతో స్నేహాల వల్ల ఎక్కువ మంది అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. కుటుంబ సభ్యులతో ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే ఇలాంటి నేరాలు తగ్గుతాయన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పిపోయిన పిల్లల ఆచూకీ అంత సులువుగా లభించదని, అలా తప్పిపోయిన పిల్లల పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందన్నారు. ఆచూకీ తెలియని పిల్లలు, తప్పిపోయిన వారిని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.కనక రాజు, మహిళా పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.నాగరత్నం, పోలీసు అధికారులు, అంగన్ వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలు


ప్రశ్నపత్రాల బండిల్స్ అందజేస్తున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపర్ – 3 పరీక్షలు ప్రారంభమయ్యాయని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టోరేజ్ పాయింట్ నుంచి ప్రధానోపాధ్యాయులకు మంగళవారం ప్రశ్నపత్రాల బండిల్స్ అందజేశారు. ప్రతిరోజు పరీక్ష సమయానికి గంట ముందుగా ప్రశ్నపత్రాల బండిల్స్‌ను ప్రధానోపాధ్యాయులకు మాత్రమే అందజేస్తామన్నారు. ఎవరైనా ప్రధానోపాధ్యాయులు రాలేని పక్షంలో ఒక ఉపాధ్యాయునికి ఆథరైజేషన్ లెటర్ ఇచ్చి పంపిస్తేనే ఇవ్వడం జరుగుతుందన్నారు. పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించాలని, మిగిలిన ప్రశ్న పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. పరీక్షల నిర్వహణ విషయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఆయా ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. ఈ పరీక్షల్లో కొన్ని జవాబులు ఓఎంఆర్ షీట్‌లపై గుర్తించాల్సి ఉంటుందని, విద్యార్థులందరికీ వారి పేర్లతో ఓఎంఆర్ షీట్లను ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్టు తెలిపారు. ఎవరికైనా తక్కువ వస్తే, బఫర్ ఓఎంఆర్‌లను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ దేవా అనిత, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్‌ఎంటీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, ఇందిర, కుమారి, కోటేశ్వరి, నాగలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

ఔత్సాహిక కళాకారులకు ప్రోత్సాహం


కార్యక్రమంలో పాల్గొన్న హాస్యనటుడు గౌతంరాజు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించి, వారికి సినీ పరిశ్రమలో అవకాశాలు ఇప్పించడానికి తన వంతు కృషి చేస్తానని మా ఏపీ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ హాస్యనటుడు గౌతంరాజు అన్నారు. మా ఏపీ అసోసియేషన్, గోదావరి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఓ హోటల్లో వర్ధమాన కళాకారుల పరిచయ కార్యక్రమం, అడిషన్స్ ఆయన అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా గౌతంరాజు మాట్లాడుతూ వర్ధమాన కళాకారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 80 మంది కళాకారులు వచ్చి, ఆడిషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జబర్దస్త్ ఆర్టిస్ట్ హరిబాబు, స్టేజ్ ఆర్టిస్ట్ గవర్రాజు, చంద్రరావు, జీమా ఫౌండర్ మహేష్, జి.ప్రెసిడెంట్ డీఎస్ఎస్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

వేణుమాధవరావు సేవలు అభినందనీయం


వేణుమాధవరావును సత్కరిస్తున్న ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం అర్బన్ వ్యవసాయ విస్తరణ అధికారి వేణుమాధవరావు అందించిన సేవలు అభినందనీయమని రాజమహేంద్రవరం, కోరుకొండ ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరావు అన్నారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారిగా అవార్డు అందుకున్న వేణుమాధవరావును జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం, రాజమహేంద్రవరం ఎన్జీవో అసోసియేషన్, వ్యవసాయ అధికారులు కలిసి మంగళవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర జేఏసీ కార్యదర్శిగా, ఏఈఓ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా వివిధ సమస్యలను వేణుమాధవరావు చిత్తశుద్ధితో పరిష్కరించి వ్యవసాయశాఖ మన్ననలు పొందారన్నారు. ఏఈఓల పదోన్నతులు విషయంలో, బీఎస్సీ ఇన్ సర్వీస్ సీట్ల విషయంలో శాంతియుతంగా పోరాడి సాధించారన్నారు. వ్యవసాయ అధికారులు శాంతా ఆలివ్, భీమరాజు, సరళ, ఎన్జీవో సంఘ నగర అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్ కుమార్, మాధవరావు సత్యమూర్తి, రమణారావు, జిల్లా ఏఈఓ సంఘ కోశాధికారి నాగేశ్వరరావు, పీటర్ పాల్గొన్నారు.

1న దొమ్మేరులో సీఎం చంద్రబాబు పర్యటన

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫిబ్రవరి ఒకటిన దొమ్మేరు గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో శాఖాపరంగా అధికారులు వారికి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ చిన్న రాముడుతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటిన ముఖ్యమంత్రి చంద్రబాబు కొవ్వూరు మండలం దొమ్మేరులో గృహ ప్రవేశం, ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్ పంపిణీలో పాల్గొంటారన్నారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత
- నగరంలో బైక్ ర్యాలీ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పిలుపు ఇచ్చారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో ఆర్టీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని మంగళవారం డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, జిల్లా రవాణా అధికారి ఎం.సురేష్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్‌తో పాటు లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరి అన్నారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. జిల్లాలో 2023లో జరిగిన 849 ప్రమాదాల్లో 329 మంది, 2024లో జరిగిన 728 ప్రమాదాల్లో 298 మృతి చెందారన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో కార్పొరేట్, సామాజిక బాధ్యతలో భాగంగా వివిధ బ్యాంకులు, రోటరీ క్లబ్, హార్లిక్స్ ఫ్యాక్టరీ, తదితర సంస్థల ద్వారా సేకరించిన 550 హెల్మెట్లను ద్విచక్ర వాహనచోదకులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తూ, బైక్ ర్యాలీ నిర్వహించడంపై ఆర్టీవో అధికారులను అభినందించారు. ప్రమాదాల బారిన పడినవారు తలకు దెబ్బ తగిలి అచేతనంగా, మంచానికే పరిమితం అయ్యే సందర్భాలు ఉన్నాయన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళిక


బొమ్మూరులో నేషనల్ హైవే పీడీ సురేంద్రనాథ్‌కు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్/కడియం: రాబోయే పుష్కరాల నాటికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. జాతీయ రహదారుల విభాగం పీడీ సురేంద్రనాథ్, బృందంతో కలిసి మంగళవారం ఉదయం మోరంపూడి నుంచి కడియపులంక వరకు జాతీయ రహదారిపై ఉన్న పలు ప్రాంతాలను పరిశీలించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాదాలమ్మ నగర్ ఆర్చి వద్ద ఫ్లైఓవర్ స్టార్ట్ పాయింట్ వద్ద హైవే, సర్వీస్ రోడ్లను పరిశీలించామన్నారు. త్వరలో మోరంపూడి నామవరం రోడ్ 4 లైన్ల రోడ్డు కాబోతున్న నేపథ్యంలో మోరంపూడి జంక్షన్ వద్ద విస్తరణ పనులు చేపట్టాలన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పలు రోడ్లు, డ్రైనేజీల విషయంపై అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో టెక్నికల్ మేనేజర్ అన్సారీ, బ్రిడ్జి ఇంజినీర్ మహేష్, ఏఎస్ఎం ఈ.రాహుల్, శ్రీనివాస్, బాలసుబ్రహ్మణ్యం, డీజీఎం రమణ, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, కడియం మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం తదితరులు ఉన్నారు.

మేయర్ సీటును అందరూ ఆశించడం సహజం

రాజమహేంద్రవరం రూరల్: కార్పొరేషన్ మేయర్ సీటును అందరూ ఆశించడం సహజమని, అయితే పార్టీలన్నీ కూర్చుని నిర్ణయం చేస్తాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పష్టం చేశారు. ఆయన మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీల విలీనం విషయంలో ఇబ్బందులు ఉన్నాయన్నారు. కోర్టు కేసులను క్లియర్ చేసి, ఎన్నికలు పెట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. 12 ఏళ్ల నుంచి మేయర్ ఎన్నికలు జరగక పోవడం మామూలు విషయం కాదన్నారు. సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో తనకు మంచి పట్టు ఉందని, బుచ్చయ్య చౌదరిని ఎవరు ఏమార్చలేరని అన్నారు.

రెప్కోబ్యాంకు సిబ్బందిపై దాడి

కంబాలచెరువు: బ్యాంకులో తీసుకున్న రుణానికి సంబంధించిన వాయిదాలు కట్టాలని అడిగినందుకు తమ కార్యాలయానికి వచ్చి దాడి చేశారంటూ రెప్కోబ్యాంకు సిబ్బంది మంగళవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రెప్కోబ్యాంకు టి.నగర్ శాఖలో ఆదెమ్మదిబ్బకు చెందిన షహెన్‌షా గృహరుణం తీసుకున్నాడు. నాలుగు వాయిదాలు కట్టకపోవడంతో అతడి ఇంటికి వెళ్లి బ్యాంకు సిబ్బంది అడిగారు. దీంతో ఆగ్రహించిన షహెన్‌షా, అతని కుటుంబ సభ్యులు టి.నగర్‌లోని రెప్కోబ్యాంకుకు వెళ్లి అక్కడ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న నూతంకి వంశీకృష్ణ, తోటి సిబ్బందిపై దాడి చేశారు. ఈ ఘటనలో వారందరికీ గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. కాగా.. షహెన్‌షా, అతడి కుటుంబ సభ్యులు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.


ఏటీఎం కార్డు మార్చి..

లలితా నగర్‌కు చెందిన రాఘవబట్ల నాగరాజు గోకవరం బస్టాండ్ వద్ద నున్న ఏటీఎంలో డబ్బులు తీసుకునేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఏటీఎంలో మరో వ్యక్తి కూడా ఉన్నాడు. అతడు నాగరాజును మాటల్లో పెట్టి, అతడి ఏటీఎం కార్డును మార్చేశాడు. అనంతరం అతడి ఖాతా నుంచి రూ.28 వేలు విత్‌డ్రా చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల స్థలాల లే అవుట్ కాలనీ పరిశీలన


పెదపూడి: అనపర్తిలోని కొత్తూరు ఇళ్ల స్థలాల లే అవుట్ కాలనీని కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం సందర్శించారు. అక్కడ నిర్మాణం పూర్తయిన గృహాలు, నివాసం ఉంటున్న వారి వివరాలను ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫిబ్రవరి ఒకటిన తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో గృహ ప్రవేశాలు, ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అనపర్తిలో కూడా చంద్రబాబు పర్యటన చేపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందుగానే ఈ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతి సందర్శించారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి, ఇతర అధికారులు

పెదపూడి: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఫిబ్రవరి 15వ తేదీ నాటికి వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ కె.నరేంద్ర రెడ్డి తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆధ్వర్యంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ ఆదేశాలపై మార్చి నెల 15వ తేదీ నాటికి ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. దానికి సంబంధించి క్లాప్ మిత్రలను నియమించుకోవాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


సూపరింటెండెంట్ సూర్యప్రభకు వినతి పత్రం అందజేస్తున్న ఎన్జీవో సంఘ నేతలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, వెంకటకృష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ సూర్యప్రభకు వినతి పత్రం అందజేశారు. రాత్రి సమయాల్లో అదనపు నర్సును, సాధారణ సెలవులు, సంపాదిత సెలవుల విషయంలో ఉన్న లోటుపాట్లు సవరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఎన్జీవో సంఘ అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా నర్సుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, నగర ఎన్జీవో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.